క్లుప్తంగా

చిల్డ్రన్స్‌పార్కులో పిచ్చికుక్క స్వైరవిహారం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో సోమవారం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. పార్కులోకి వాకింగ్ చేసేందుకు వచ్చిన 8 మందిని కరిచింది. గత కొద్ది రోజులుగా చిల్డ్రన్స్‌పార్కు వద్ద కుక్కల బెడద తీవ్రంగా ఉంది. దీంతో పార్కుకు వచ్చే వారితో పాటు వాకర్స్ ఇబ్బందులకు గురవుతున్నారని చిల్డ్రన్స్ పార్కు వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సింగంశెట్టి మురళీ మోహన్ తెలిపారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరారు.

కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను వెంటనే పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోర్టు యాజమాన్యం నిబంధనలను తుంగలో తొక్కి పర్యావరణాన్ని కాలుష్యం చేసే బొగ్గు, బూడిద, ఐరన్‌ఓర్ ఎగుమతి, దిగుమతి చేస్తోందని ఆరోపించారు. కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని జిల్లా అభివృద్ధికి, నిరుద్యోగుల ఉపాధికి దోహదపడాలని కోరారు. కంటైనర్ టెర్మినల్‌ను సాధించే వరకు సీఐటీయూ ఉద్యమాలు, పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్, కృష్ణపట్నం పోర్టు వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ గోగుల శ్రీనివాసులు, జిల్లా నాయకులు అల్లాడి గోపాల్, సురేష్, రాజా, తదితరులు, పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి విలువలతో కూడినది



నెల్లూరు(సిటీ): నేటి సమాజంలో నర్సింగ్ వృత్తి విలువలతో కూడినదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నెల్లూరురూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురం వద్ద ఉన్న బొల్లినేని నర్సింగ్ కళాశాలలో ల్యాంప్ లైటింగ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ సతీష్‌కుమార్, ప్రముఖ గైనకాలజిస్ట్ డా.లక్ష్మీదుర్గా, కిమ్స్ సీఈఓ గిరి నాయుడు పాల్గొని మాట్లాడారు. నేటి ప్రపంచంలో వైద్య వృత్తికి ఆదరణ పెరుగుతోందన్నారు. అనేక మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు వస్తున్నప్పటికీ నర్సుల వల్లే వాటి మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నర్సులకు డిమాండ్ పెరుగుతోందన్నారు. అనంతరం అకడమిక్, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన నర్సింగ్ విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. నర్సింగ్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లినేని నర్సింగ్ కళాశాల డీజీఎం శివమాల, ప్రిన్సిపల్ డా. అశోక్ పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు



నెల్లూరు(మినీబైపాస్): మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో బీజేపీ నాయకుడు సురేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకయ్యనాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు తన జీవిత విశేషాలపై ప్రచురించిన 'వెంకయ్యనాయుడు ఏ లైఫ్ ఇన్ సర్వీస్' పుస్తకాన్ని సంతకం చేసి సురేందర్‌రెడ్డికి అందజేశారు.

జోజి సేవలు ఎనలేనివి



నెల్లూరు (టౌన్): అధ్యాపకులుగా జోజి ఎనలేని సేవలు అందించారని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన జోజిని సహచర అధ్యాపకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జోజీ అధ్యాపక వృత్తితో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారని కొనియాడారు. వైస్‌ప్రిన్సిపల్ రమణయ్య, ఎమీల్యమ్మ, అధ్యాపకులు రాంబాబు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రసాద్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ప్రజారోగ్యవేదిక రాష్ట్రాధ్యక్షుడు ఎంవీ రమణయ్య

- ప్రజారోగ్యవేదిక రాష్ట్రాధ్యక్షుడు ఎంవీ రమణయ్య

నెల్లూరు(అర్బన్): వైద్యం అందని ద్రాక్షగా మారకుండా ఉండాలంటే ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రజారోగ్యవేదిక రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య అభిప్రాయపడ్డారు. నగరంలోని హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆరోగ్యరంగంలో ఉత్తమ సేవలందిస్తున్న పలువురు వైద్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో డాక్టర్ ఎంవీ రమణయ్య మాట్లాడారు. దేశంలో ఆరోగ్య హక్కు చట్టాన్ని ఒక్క రాజస్థాన్ రాష్ట్రంలోనే అమలు చేస్తున్నారని తెలిపారు. అదే చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టంతో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడైనా ఉచితంగా ఎమర్జెన్సీ సేవలు పొందే హక్కు లభిస్తుందన్నారు. ప్రభుత్వం ఆరోగ్యరంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచడంతో పాటు అన్ని రకాల వైద్య పరికరాలను ఆస్పత్రుల్లో ఉంచాలని డిమాండ్ చేశారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో వైద్యం బలోపేతమైతే పేదలందరికీ మేలు జరుగుతుందన్నారు. అనంతరం తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తూ.. వైద్యాన్ని వ్యాపారపరంగా కాకుండా సామాజిక పరంగా చేస్తున్న రెడ్‌క్రాస్ కేక్యాన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి, కావలికి చెందిన డాక్టర్ ప్రభాకర్‌నాయుడు, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి, పెద్దాస్పత్రిలోని డైస్ చిన్నపిల్లల విభాగం ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాజేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు దైవంతో సమానం

నెల్లూరు(అర్బన్): తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులు, క్షతగాత్రులకు తమ వైద్యంతో ప్రాణాలు పోస్తున్న వైద్యులు దైవంతో సమానమని నారాయణ మెడికల్ గ్రూపు ఏజీఎం చొకచర్ల భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నారాయణ డెంటల్ కళాశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వైద్యులకు అత్యంత గుర్తింపు ఉందన్నారు. పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ తమకు వైద్యవిద్యను నేర్పించిన గురువులను సన్మానించుకోవడం తమ ధర్మమన్నారు. అనంతరం డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌రెజినాల్డ్, డాక్టర్లు శివకుమార్, సునీల్‌కుమార్, ప్రసాద్, వందనరఘునాథ్, కన్నన్, లావణ్య తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా నాయకులు గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాసు, వీరయ్య, మోహన్ పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని వెంకటేశ్వరపురంలో దివ్యాంగుల ఐక్యసంఘం ఆధ్వర్యంలో పలువురు వైద్యులను ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వరపురంలోని డా.ప్రసాద్ ఆస్పత్రిలో వైద్యులు నరసాపురం ప్రసాద్, శివ, మహ్మద్‌ఖాన్‌ను శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. అనంతరం కేక్‌కట్ చేశారు. దివ్యాంగుల ఐక్య సంఘం జిల్లా అధ్యక్షులు సనావుల్లా, జక్కావుల్లా, శ్రీవాణి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ విజయ్, జ్ఞానేంద్రియ అంధుల సేవా సంస్థ నిర్వాహకులు రవి, ఆయేషా, రేష్మా, హేమ, బషీర్, తదితరులు, పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న పీహెచ్‌పీ సభ్యులు



దివ్యాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో...

4న విద్యా సంస్థల బంద్

నెల్లూరు (టౌన్): నీట్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈ నెల 4న జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్‌ను మళ్లీ నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రికి మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. నీట్ పేపర్ లీక్‌కు కారణమైన ఎన్డీఏ ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లాలోని విద్యాసంస్థలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు యాజమాన్యాలు సహకరించాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఈ సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు శ్రీహర్ష, శివ, చరణ్, జీవన్, ప్రశాంత్, మస్తాన్‌షరీఫ్, పవన్‌కిషోర్, శివవర్మ, ఆకాష్, కిరణ్, నాగసాయి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జ్యోతి మరణం బాధాకరం

నెల్లూరు(అర్బన్): బేజర్ల మండలం చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నంబూరి జ్యోతి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని ఏపీ హెల్త్‌అడ్మినిస్ట్రేషన్ అండ్ మెడికల్ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు బేజర్ల సుధాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యశాఖలో మంచి పేరు కలిగిన జ్యోతి జాతీయ వైద్యుల దినోత్సవం నాడు మృతి చెందడం అత్యంత విషాదకరమన్నారు. తొందరపాటులో తీసుకునే నిర్ణయాలు కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని, వేదనను మిగులుస్తాయన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపాన్ని ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైద్యుల సంఘం సంతాపం

ఎంతో భవిష్యత్తు ఉన్న డాక్టర్ జ్యోతి అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమె మృతిపై తన సంతాపాన్ని ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

21న పాటలు, నృత్య పోటీలు

నెల్లూరు(బృందావనం): కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న పురమందిరంలో జిల్లా స్థాయి పాటలు, నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు ఆ ట్రస్టు అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను నర్తకి సెంటర్‌లో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేతా సుబ్బారావు ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు జూనియర్, సీనియర్ విభాగాల్లో సినిమా పాటలు, శాస్త్రీయ నృత్య, వెస్ట్రన్ డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు ఈ నెల 12వ తేదీలోగా 77299 42543 నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వీనులవిందుగా సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు, ఎస్కే షఫీ, బీ రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మ రక్షణకే కంసవధ



నెల్లూరు(బృందావనం): ధర్మ రక్షణకే శ్రీకృష్ణుడు కంసుడిని వధించాడని శతావధాని కొండెపి మురళీకృష్ణ తెలిపారు. పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో జరుగుతున్న 'శ్రీకృష్ణ కథామృతం' భాగవత సప్తాహంలో భాగంగా 6వ రోజు సోమవారం 'కంస వధ' అంశంపై ఆయన ఉపన్యసించారు. అక్రూరుని భక్తి, కురూపి కుబ్జసేవ తదితర విషయాలను వివరించారు. సభా పోషకులుగా అన్నవరం సత్యనారాయణ వ్యవహరించారు. అనంతరం కొండెపి మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు.

నేత్రపర్వంగా మహావిష్ణు కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలోని మహాలక్ష్మి, గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గురువాయూర్ మహావిష్ణువు ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా గంటా రమణయ్యనాయుడు, ప్రమీల దంపతులు వ్యవహరించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 4.30 గంటలకు పుష్పయాగం, రాత్రి 8గంటలకు ధ్వజావరోహణం నిర్వహించనున్నట్లు స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం తెలిపారు.

దుప్పట్ల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ జిల్లా మైనార్టీ విభాగం మాజీ చైర్మన్ అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో బారాషహీద్ దర్గాలో సోమవారం పేదలకు అన్నదానం, పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాజామస్తాన్, సుధీర్, మహ్మద్, హనాఫ్, ఫజల్, బాబు, మల్లికార్జునరెడ్డి, చాన్‌బాషా, మైనుద్దీన్, అల్లాబక్షు,తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ సేవలు మరువలేనివి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో 33 ఏళ్ల పాటు చంద్రశేఖర్ అందించిన సేవలు మరువలేనివని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేసిన ఎం చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ సభను నగరంలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఈ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాట్లాడుతూ చంద్రశేఖర్ శేష జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం చంద్రశేఖర్‌ను విద్యుత్ ఉద్యోగులతో కలిసి సత్కరించారు.



డయేరియా నిర్మూలనకు ముందస్తు చర్యలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్లను వైద్యాధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ప్రాంతంలో కూడా డయేరియా ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు జిల్లాలో డయేరియా నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ప్రధానంగా ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడకుండా ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి డయేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి ఇంట్లో రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు అందజేస్తామని అన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, డయేరియాపై ప్రజలను అప్రమత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు డయేరియా నిర్మూలన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిని నివారిద్దాం

- డీఎంహెచ్ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): డెంగీ వ్యాధిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య సూచించారు. డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని వైద్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి ప్రభుత్వ బీఈడీ కళాశాల వరకు వైద్యశాఖ ఉద్యోగులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణకు కృషి చేస్తామని ఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఏడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు వల్ల డెంగీ వ్యాధి వస్తుందన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డెంగీ కేసులు పెరిగే అవకాశం ఉందని, కొన్ని రకాల డెంగీ కేసులు ప్రాణాంతకమని తెలిపారు. ప్రజలు దోమలు కుట్టకుండా, ఇళ్లతో పాటు పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు డెంగీ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని తెలిపారు. అనంతరం ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో డెంగీ నివారణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి, జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ, ఎన్‌సీడీ ప్రోగ్రామింగ్ అధికారి సుదీర్‌కుమార్, డెమో అధికారి శ్రీనివాసరావు, ఏఎంఓ నాగార్జునరావు, ఆశా కార్యకర్తలు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య తదితరులు

ఒత్తిడిని వీడి ఉల్లాసంగా గడపండి



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ, ఏఎస్పీలు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిళ్లు ఎదుర్కొన్న పోలీసు సిబ్బంది ఉద్యోగ విరమణ అనంతరం శేషజీవితాన్ని కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడపాలని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ సూచించారు. నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన పోలీసు సిబ్బంది ఉద్యోగ విరమణ సభలో ఎస్పీ పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన డీసీఆర్‌బీ, నవాబుపేట ఎస్సైలు కే శ్రీనివాసరావు, బీ శివప్రకాష్, వేదాయపాళెం, టీపీగూడూరు, వెంకటాచలసత్రం ఏఎస్సైలు ఎం కృష్ణయ్య, ఎస్ సుబ్బరాజు, ఆర్వీ రమణ, డీటీసీ హెచ్‌సీ ఎండీ షరీఫ్, ఏఆర్ హెచ్‌సీ జీ విజయానందంను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు కే రామకృష్ణారెడ్డి, షఫీఅహ్మద్, వెల్ఫేర్, హోమ్‌గార్డు ఆర్ఐలు రాజారావు, నాగరాజు, ఆర్ఎస్సైలు, పోలీసు అధికారుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య, సమగ్రశిక్ష, ఆధ్వర్యంలో రోటరీ క్లబ్, యూనివర్సిటీ ఆఫ్ మెల్బోర్న్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కెరీర్ గైడెన్స్‌పై తరగతులను నగరంలోని అవెన్యూ స్కూల్‌లో సోమవారం నిర్వహించారు. జిల్లాలోని 20 పాఠశాలల హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు ఈ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, స్టేట్ అబ్జర్వర్ శారదాకుమారి, గ్లోబల్ ఎడ్యుకేషన్ సొసైటీ సీఈఓ రాక్వెల్ శరఫ్, డీవీఈఓ మధుబాబు, ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

నెల్లూరు(బారకాసు): ప్రజల నుంచి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగర కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజలు సమస్యలపై అందజేసే అర్జీల పరిష్కార నివేదికను తదుపరి వారం జరిగే సమావేశంలో అందించాలన్నారు. వాటికి సంబంధించిన ఎండార్స్‌మెంట్లను ఆయా విభాగాధిపతులే పరిశీలించాలని, విభాగాల వారీగా అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. ఫిర్యాదులను పరిష్కరించిన అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. కాగా ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 29 ఫిర్యాదులు రాగా రెవెన్యూ 1, ఇంజినీరింగ్ 11, టౌన్‌ప్లానింగ్ 6, హౌసింగ్ 3, పబ్లిక్ హెల్త్ 2, అకౌంట్స్ 4, పెన్షన్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

పూడికతీత పనులపై శ్రద్ధ పెట్టాలి

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీల్లో పూడికతీత పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. నగరంలో ఎక్కడ వర్షపు నీరు నిలబడినా ఇంజినీరింగ్ అధికారులదే బాధ్యత అని, నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవడానికి అవసరమైన ప్రతిపాదనలు, అనుమతులు, నూతన కల్వర్టుల నిర్మాణాలకు ప్రతిపాదనలను వీలైనంత త్వరితగతిన తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, సిటీప్లానర్ దేవీకుమారి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఇంజినీరింగ్ అధికారులు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్